ప్రజాశక్తి
మంగళవారం 18 మార్చి 2025
5
శ్రీ సత్యసాయి

హిందూపురంలో పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

మొదటి రోజు 210 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభం అయ్యాయి. అన్ని కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. జిల్లాలో రెండు డివిజన్ల పరిధిలోని 104 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. సోమవారం జరిగిన తెలుగు పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 21,393 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 21,183 మంది హాజరయ్యారు. 210 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాధికారి కిష్టప్ప తెలిపారు. పెనుగొండ డివిజన్‌లో 129 మంది, ధర్మవరం డివిజన్‌లో 81 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. కేంద్రాల వద్ద ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా గట్టి భద్రత ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు.

కలెక్టర్, ఎస్పీ తనిఖీ

పదో తరగతి పరీక్ష కేంద్రాలను కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్నలు పరిశీలించారు. పుట్టపర్తి ఎనుములపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని వీరిద్దరూ తనిఖీ చేసి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల వద్ద భద్రతా చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని ఎస్పీ పోలీసు సిబ్బంది సూచించారు.

ఐసీడీఎస్ పీడీగా తోట శ్రీదేవి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా ఐసీడీఎస్ పీడీగా తోట శ్రీదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు ఐసీడీఎస్ డైరెక్టరేట్ కార్యాలయంలో పని చేస్తున్న శ్రీదేవి శ్రీ సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి పీడీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. 2008 బ్యాచ్‌కు చెందిన శ్రీదేవి అనంతపురం జిల్లా తాడిపత్రి ఏసీడీపీవోగా గతంలో పని చేశారు. డిప్యూటేషన్‌పై డైరెక్టరేట్‌లో పని చేస్తున్న ఆమెను శ్రీ సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి పీడీగా నియమించారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి పీడీగా పని చేసిన ఓడి.చెరువు సీడీపీవో సుధా వరలక్ష్మి నుంచి ఆమె బాధ్యతలు తీసుకున్నారు. అంతకు ముందు నూతన పీడీ శ్రీదేవి కలెక్టర్ టిఎస్.చేతన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

'భూ' చాళ్లు..!

'చిన్న పిల్లలు అన్నం తినకుండా మారం చేస్తే భూచాడొచ్చాడని భయపెట్టి తినపించడం చూస్తుంటాం.' అటువంటిదే జిల్లాలో భూముల విషయాల్లోనూ జరుగుతోంది. పరిశ్రమలొచ్చేస్తున్నాయి... మీ భూములను తక్కువ ధరకే తీసేసుకుంటారు.. మేమైతే ఎక్కువ ధర ఇస్తామని చెప్పి భూములను తమ వశం చేసుకునే పద్ధతులు జోరుగా సాగుతున్నాయి. వివాదాలను వారే సృష్టించి సెటిల్‌మెంట్ పేరుతో సమస్యను పరిష్కరిస్తున్నట్లు నటించి మోసం చేస్తున్నారు. ఇలాంటి 'భూ'చాళ్లతో అసలైన భూ హక్కుదారులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

- ◆ రైతులను భయపెట్టి, ప్రలోభపెట్టి భూములు వశం
- ◆ వేల ఎకరాల సేకరణకు సాగుతున్న కసరత్తు
- ◆ వివాదాలొస్తే పెద్దలొచ్చి సెటిల్‌మెంట్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెన్యూవబుల్ ఎనర్జీ పేరుతో సోలార్, విండ్, హైబ్రీడ్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం పెద్దఎత్తున అనుతులిచ్చింది. గత ప్రభుత్వం హయాంలో ఇచ్చినవి, ఇప్పుడు ఇస్తున్నవి కలిపి సుమారు ఏడు, ఎనిమిది మెగావాట్ల విత్యుత్ ఉత్పత్తికి అనుమతులు ఉమ్మడి జిల్లాలో ఉన్నాయి. వీటికి సోలార్‌కు అయితే సగటున ఒక్క మెగావాట్‌కు నాలుగు నుంచి గరిష్టంగా ఆరు ఎకరాల వరకు భూమి అవసరం అవుతుంది. అదే విండ్‌కు అయితే మూడు ఎకరాల వరకు భూమిని సేకరిస్తున్నారు. టవర్ ఏర్పాటు అర ఎకరంలోనే పూర్తయినా.. దానికి భవిష్యత్‌లో దారి వాటికోసమని అదనంగా సేకరిస్తున్నారు. ఈ లెక్కన ఒక్క మెగావాట్‌కు సగటున నాలుగు ఎకరాల వరకు భూమి అవసరం అవుతోంది. ఈ భూమిని ప్రభుత్వం సోలార్‌కు అయితే ఎకరానికి ఏడాదికి రూ.31 వేలు లీజు చెల్లించాలని నిబంధన అనుమతుల సమయంలో కంపెనీలకు షరతు పెట్టింది. కాకపోతే సేకరణ వారికే వదిలేసింది. దీంతో భూమిని లీజు పద్ధతిలో కాకుండా నేరుగా సేకరించడం ద్వారా ఏడాది లీజు తగ్గుతుందన్న ఉద్దేశంతో ఆ సంస్థలు ఒకేసారి భూసేకరణ కూడా వీలైన చోటల్లా చేపట్టేందుకే మొగ్గు చూపుతోంది. ఇది ఒక రకంగా స్థానిక నాయకులకు కూడా వరంగా మారుతోంది. కంపెనీకి అవసరమైన భూసేకరణ వ్యవహారాన్ని చక్కబెట్టే పని స్థానికంగానున్న నేతలు చేపడుతున్నారు. అంటే ఈ భూముల కొనుగోళ్లలో పెద్దఎత్తున చేతులు మారుతున్నాయన్న ఆరోపణలున్నాయి. భూములు కంపెనీలకు పోతున్నాయి... తమకిస్తే ఒకేసారి మొత్తం డబ్బులు చెల్లిస్తామని స్థానిక నేతలు మధ్యవర్తిత్వం వహిస్తుండటం గమనార్హం.

సమస్యవస్తే పెద్ద మనిషి సెటిల్‌మెంట్

అనంతపురం జిల్లాలో ఒక నియోజకవర్గంలో రెవన్యూవబుల్ ఎనర్జీ కోసమని ఒక సంస్థకు అనుమతులొచ్చాయి. ఆ సంస్థకు భూసేకరణ చేయాల్సి ఉంది. పక్క జిల్లాకు చెందిన ఒక వ్యక్తి వచ్చి భూసేకరణ ప్రక్రియను ప్రారంభించాడు. స్థానికంగా ఉన్న నాయకులు దీన్ని అడ్డుకున్నారు. తాముండగా బయటనుంచి వచ్చి ఏ రకంగా చేస్తారని అడ్డుపడ్డారు. దీంతో అమరావతి నుంచి ఒక పెద్ద మనిషి ఆ నియోజకవర్గానికి విచ్చేశారు. ఆయన స్థానిక నాయకులు, భూసేకరణ చేపట్టిన వ్యక్తుల మధ్య సయోధ్య కుదర్చివెళ్లినట్టు సమాచారం. ఇందులో పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రకంగా భూసేకరణ స్థానిక నాయకులకు కాసుల వర్షం కురిపిస్తోంది. కంపెనీలకు విద్యుత్ ఉత్పత్తి ద్వారా కాసులొస్తుండగా, నేతలకు భూ వ్యవహారాలు పంట పండిస్తున్నాయి. రైతులు మాత్రం భూములు, గ్రామాలను వదిలి శాశ్వత వలసలు వెళ్లే పరిస్థితులు నెలకొనబోతున్నాయి.

కాటికాపర్ల సమస్యలు పరిష్కరించాలి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

కాటి కాపర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంబంధిత నాయకులు కోరారు. ఈ మేరకు కెవిపిఎస్ ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎంవి రమణ మాట్లాడుతూ కాటికాపర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య చెప్పించాలని, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి తోడు ఇల్లు, ఇంటి స్థలం ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందమూరి నగర్ నంజుండప్ప, నరసింహప్ప, మలుగూరు నరసింహప్ప, కొటిపి రామప్ప, రాచపల్లి అంజినప్ప తదితరులు పాల్గొన్నారు

తాగునీటి సమస్య రానీయొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్డీవోలు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో తాగునీరు, వడగాల్పులు, పి4 సర్వే, రీ సర్వే, పిజిఆర్‌జిఎస్ తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తో కలిసి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో వడగాలులు, ఎండలు ఎక్కువగా ఉంటాయని విపత్తుల శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే మూడు నెలలు కీలకమని తాగునీటి సరఫరాపై ఎక్కడా ప్రతికూల సమస్యలు రాకుండా ముందుగానే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

పి4 క్యూఆర్ కోడ్ ప్రశ్నావళి పూర్తి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక వ్యవస్థ ఫీడ్ బ్యాక్ ప్రారంభించాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చూపకుండా క్షేత్రస్థాయిలో వెళ్లి పరిష్కరించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 234 అర్జీలు కలెక్టర్ స్వీకరించారు. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీవో సువర్ణ, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, సిపిఒ విజయ్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ నర్సయ్య వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరగతిన పరిష్కరించాలన్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు త్వరలో విజయవాడలో నిర్వహించే కలెక్టర్ల సమావేశానికి తగిన నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

19న ఎమ్మెల్యే కార్యాలయంలో ఫిర్యాదుల దినోత్సవం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు స్థానిక ఎంఎల్‌ఏ కార్యాలయంలో ఈనెల 19న ఫిర్యాదుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 10 గంటలకు గ్రీవెన్స్ డే లో ప్రజలు పాల్గొని వినతులు అందించాలని సూచించారు. ప్రజల సమస్యల గురించి ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి ప్రత్యేక సెల్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మునిసిపల్ అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవాలని వారు కోరారు.

మున్సిపల్ కార్మికుల కుటుంబాలను ఆదుకోండి

ప్రజాశక్తి-పెనుకొండ

నగర పంచాయతీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ మరణించిన ముత్యాలు, నరసింహులు కుటుంబాలను ఆదుకోవాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారా యణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, సిఐటియు మండల కన్వీనర్ బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు మృతి చెందిన కార్మికుల కుటుంబాల సభ్యులతో కలిసి నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ కార్మికుల అకాల మరణంతో వారి కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. వారికి ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మరణించిన కార్మికుల స్థానాల్లో అర్హులైన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్ స్పందిస్తూ కార్మికుల భార్యలను ఉద్యోగంలో చేర్చుకుంటామని, ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలు త్వరగా వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వారితో పాటు యూనియన్ నాయకులు వెంకటేష్, కార్మికులు ఉన్నారు.

కమిషనర్‌తో మాట్లాడుతున్న నాయకులు

ప్రయివేటు డిగ్రీ కళాశాలల సంఘం

ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివ శంకర్

ప్రజాశక్తి - కదిరి టౌన్

శివశంకర్

కదిరి కి చెందిన బ్లూమూన్ కళాశాలల చైర్మన్ శివశంకర్ డిగ్రీ కళాశాలల సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో గల ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య కమిటీ సమావేశాన్ని స్థానిక నలంద డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ కళాశాలల యాజమాన్య సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులుగా పెద్దరాసు భక్తవత్సలం, ఉపాధ్యక్షులుగా కెబి. చౌదరి, ప్రధాన కార్యదర్శిగా మంచి శివశంకర్, సహాయ కార్యదర్శిగా వేణుగోపాల్, కోశాధికారిగా సత్యనారాయణను ఎన్నుకున్నారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ వనజ, డాక్టర్ బసయ్య, రామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కదిరి కి చెందిన బ్లూమూన్ విద్యాసంస్థలు అధినేత శివశంకర్ ప్రధాన కార్యదర్శి గా ఎన్నికైన సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

రక్త బంధం ట్రస్టు సభ్యుడికి జాతీయ పురస్కారం

బత్తలపల్లి : మండలంలోని పోట్లమర్రి గ్రామాని కి చెందిన రక్త బంధం ట్రస్టు సభ్యులు చెడుపోతుల వీరప్పకు సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పురస్కారం వరించింది. ఆదివారం జరిగిన పొన్నూరు బ్లడ్ అసోసియేషన్ 9వ వార్షికోత్సవం సందర్భంగా మన పొన్నూరు బ్లడ్ అసోసియేషన్ చైర్మన్ టి ఉమా శంకర్, ప్రముఖ కవి, రచయిత రంగు శెట్టి రమేష్, ఉద్యోగ రాజకీయ విశ్లేషకులు చందు సాంబశివరావు, స్థానిక నాయకులు పార్వతి నాయుడుచేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా అవార్డు గ్రహీత చెడు పోతుల వీరప్ప మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పురస్కారాల అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. అవార్డుకు తనను ఎంపిక చేసిన మన పొన్నూరు బ్లడ్ అసోసియేషన్ చైర్మన్ తిరుమల శెట్టి ఉమాశంకర్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతుల వెల్లువ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను వినతిపత్రాల రూపంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు

30 ఏళ్లుగా తిరుగుతున్నా పాసుబుక్ ఇవ్వడం లేదు

తనకున్న భూమికి పాస్ పుస్తకాలు ఇవ్వాలని గత 30 ఏళ్లుగా కాళ్లు అరిగేలా అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని ఓ రైతు కలెక్టర్ టీఎస్ చేతన్ కు మొరపెట్టుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లికి చెందిన రైతు చిమిరాల జగన్నాథ పుట్టపర్తి పొలంలో సర్వే నెంబరు 295–1, 296–3 సర్వే నెంబర్లలో ఉన్న భూమికి సంబందించి రిజిస్టర్ డాక్యుమెంట్లు, లింక్ డాక్యుమెంట్లుతో పూర్తి హక్కులు తనకే ఉన్నాయన్నారు. వీటికి పాసుపుస్తకం ఇవ్వాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానన్నారు. స్పందించిన కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో సువర్ణకు ఆదేశించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

పంట సాగుదారుల హక్కుల చట్టం 2019 ప్రకారం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అడపాల వేమ నారాయణ, చౌడప్ప యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు.

పంటలు ఎండిపోతున్నాయి .. నీరివ్వండి

వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు, గ్రామస్తులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోనికోడూరు చెరువు కింద పంటలు పండిస్తున్న పొలాలకు నీరు వదలాలని కోడూరు గ్రామ రైతులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. పంటలు ఎండిపోతున్నాయని వెంటనే నీరు విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక డిటి జగన్నాథ్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కోడూరు చెరువు కింద మొక్కజొన్న, రాగి, వరి పంటలు పండిస్తున్నామన్నారు. ఎండలు తీవ్రమవడంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. దాదాపు 100 ఎకరాలు వరకు కుషావతి నదిలో ఉన్న నీటి ద్వారా నీటిని పంటలకు వదులుకుంటూ ఉండేవారమన్నారు. ఆ కుషావతి నదిలో కూడా ఇప్పుడు నీరు ఇంకిపోవడంతో పంటలకు నీరందక ఎండిపోతున్నాయని వాపోయారు. తక్షణమే చెరువులో ఉన్న నీటిని కుశావతి నదిలోకి వదిలి పంటలు ఎండిపోకుండా కోడూరు చెరువు ద్వారా నీటిని అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, రైతు సంఘం నాయకులు లక్ష్మి నారాయణ, రామచంద్ర, క్రిష్ణ, నరసింహ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి అనంతలో మిల్లెట్ మేళా

ప్రజాశక్తి-అనంతపురం

'మన పంటలు, మన వంటలు, ఆరోగ్యం' అన్న మూడు ప్రధానమైన అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈనెల 22 నుంచి 24వ తేది వరకు అనంతపురం నగరంలో మిల్లెట్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి తెలిపారు. అనంతపురం నగరంలోని ఎఎఫ్ ఎకాలజీ కేంద్రంలో సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో మీడియా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు రోజుల కార్యక్రమ వివరాల పోస్టరును విడుదల చేశారు. 22 నుంచి నుంచి ఈనెల 24వ తేదీ వరకు అనంతపురం నగరంలోని పోలీసు కన్వెన్షన్ హాలులో మిల్లెట్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదంచ చేయాలని మల్లారెడ్డి పిలుపునిచ్చారు.

ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి : వ్యకాసం

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం మండల పరిధిలోని కనిశెట్టిపల్లి, వడ్డిపల్లి గ్రామాల్లో ఉపాధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ 2 నెలలుగా దాదాపు 9 వారాల ఉపాధి బిల్లులు మంజూరు కాక కూలీలు ఆర్థిక ఇబ్బందులు పడితున్నారన్నారు. తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. పనిముట్లు అందజేయాలన్నారు. పని ప్రదేశంలో నీటి సౌకర్యం, ప్రథమ చికిత్స బాక్స్ ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమం ఉపాధి కూలీలు ఆదినారాయణ, నంజుడప్ప, నరసమ్మ, సరోజమ్మ, యశోదమ్మ, అక్కమ్మ, రత్నమ్మ, ప్రభావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : ఉపాధి కూలీలకు బకాయి బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసంఘం నాయకులు సోమవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కు సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పలు చోట్ల 10 వారాలు పాటు బిల్లులు బకాయిలు ఉన్నాయన్నారు. బిల్లులు అందక కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఫారం ఫండ్స్ పనులు కూలీలకు కల్పిస్తున్నారే తప్ప ఇతర పనులు కేటాయించలేదన్నారు. దీంతో గట్టి నేలలో పనులు చేయాలంటే కూలీలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కోశాధికారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మోహినీ అవతారంలో నారసింహుడు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో 9వ రోజైన సోమవారం లక్ష్మీ నరసింహ స్వామి మోహినీ అవతారంలో దర్శనమిచ్చారు. స్వామివారి ఊరేగింపు ముందు భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలు, కళాకారుల వాయద్యాల నడుమ స్వామివారి ఉత్సవం కోలాహలంగా జరిగింది. సోమవారం స్వామివారిని మోహిని అలంకార రూపంలో దర్శించుకోవటానికి ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా పదో రోజు మంగళవారం ప్రజా గరుడవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి, ఆర్డీవో వివిఎస్ శర్మ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మోహినీ అవతారంలో ఊరేగుతున్న శ్రీవారు

సజావుగా పదో తరగతి పరీక్షలు

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

రొద్దం మండలంలో బస్సు సౌకర్యం లేక ఎండలో నడిచి వెళుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక జడ్పీ హైస్కూల్‌లో సోమవారం జరిగిన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఏ-సెంటర్‌లో 205 మందికి గానూ ఇద్దరు, బి-సెంటర్‌లో 198 మందికి గానూ ఇద్దరు గైర్హాజరైనట్లు ఆయా సెంటర్ల చీఫ్‌లు రసూల్, విటల్ తెలిపారు. చీఫ్‌లు ఎప్పటికప్పుడు అన్ని గదుల్లో కలియ తిరు గుతూ పర్యవేక్షించారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాజకుళ్లాయప్ప, పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

లేపాక్షి : లేపాక్షిలోని 3 కేంద్రాల్లో తొలి రోజు 673 మంది విద్యార్థులకు గానూ 668 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఇఒలు నాగరాజు, కుళ్లాయప్ప తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రొద్దం : స్థానిక ప్రభుత్వ హైస్కూల్, మండలంలోని ఆర్.మరవపల్లి కెజిబివిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో తొలిరోజు పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగాయి. రొద్దం సెంటర్‌లో 221 మందికి వంద శాతం హాజరు కాగా, కెజిబివి సెంటర్‌లో 210మందికి 207 మంది హాజరయ్యారు. పెనుకొండ సిఐ ఆధ్వర్యంలో రొద్దం పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

ఎర్రటి ఎండలో విద్యార్థుల ఇబ్బందులు..

బస్సు సౌకర్యం లేక పలువురు విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు కాలినడకన చేరుకున్నారు. రొద్దం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆర్.మరవపల్లి కెజిబివి సెంటర్‌కు కాలినడకన వెళ్లారు. పరీక్ష అనంత రం మధ్యాహ్నం ఎర్రటి ఎండలో ప్రధాన రహదారిపై దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ దూరం నడిచి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉండగా రోడ్డుపై విద్యార్థులు వెళ్తుండగా కొందరు ఆకతాయిలు ద్విచక్ర వాహనాలపై ఇష్టారాజ్యాంగా విన్యాసాలు చేస్తే విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేశారు. ఇకనైనా అధికారులు స్పందించి పరీక్షల వేళలకు అనుగుణంగా బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

నంబులపూలకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తహశీల్దార్ దేవేంద్ర నాయక్,ఎంపిడిఒ అంజినప్ప సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షా రాసే సమయంలో ఎవరు ఆటంకాలు కలిగించరాదని,నూరు మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

బత్తలపల్లి : బత్తలపల్లిలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. బాలుర ఉన్నత పాఠశాలలో 220 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 119 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 210 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 208 మంది హాజరైనట్లు ఎంఇఒలు చాముండేశ్వరి, సుధాకర్ నాయక్ తెలిపారు. పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేశారా లేదా అని ఆరా తీశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

గాండ్లపెంట : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కెజిబివిలో జరిగిన పదోతరగతి పరీక్షలను అధికారులు పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎస్ఐ వలి భాష ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారుజ

కదిరి టౌన్ : పట్టణంలో జరుగుతున్న పది పరీక్షా కేంద్రాలను ఆర్డీవో వివిఎస్. శర్మ తనిఖీ చేశారు. సోమవారం జరిగిన 10 పరీక్షలకు 2153 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈయన వెంట మండల విద్యాశాఖ అధికారులు చెన్నకృష్ణ, ఓబుల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బుక్కపట్నం : మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పదవ తరగతి పరీక్షలు సజావుగా జరిగాయి. మండల కేంద్రంలో బాలుర బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన పరీక్షలలో 350 మంది విద్యార్థులు హాజరయ్యారు. వెంగళమ్మ చెరువు, సిద్దరాంపురం, కస్తూరిబా హై స్కూల్, ఎం జె బి, కేజీబీపీ, బాలుర, బాలికలు ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల కేంద్రంలోని రెండు సెంటర్ల నందు పరీక్షలు రాశారు. పరీక్షలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఇఒ గోపాల్ నాయక్ తెలిపారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని మొరంపల్లి సమీపంలో ఓ రియల్టర్ ఎస్టేట్ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉత్తర్ ప్రదేశ్ కు చెందిన అర్జున్ (21) జీవనోపాధి కోసం ఇక్కడి వచ్చి ఓ రియల్టర్ వద్ద పని చేస్తుండేవాడు. కుటుంబసమస్యల నేపథ్యంలో ఆదివారం రాత్రి పురుగుల మందు తాగారు. గమనించిన బంధువులు కర్ణాటక లోని బాగేపల్లి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ అర్జున్ మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముక్కడిపేటలో షార్ట్ సర్క్యూట్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలోని ముక్కడి పేటలో ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఓ ఇంటితోపాటు అందులోని సామాగ్రి, నగదు దగ్ధమయ్యాయి. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులందరూ బయట ఉన్న సమయంలో ఒక్కసారిగా షార్ట్‌సర్క్యూట్ ఏర్పడింది. దీంతో మంటలు చెలరేగి ఇంటితోపాటు అందులోని నిత్యావసరాలు, దుస్తులు, వ్యాపారం నిమిత్తం దాచుకున్న రూ.1.70 లక్షల నగదు కాలిపోయాయి. ప్రమాదం సంభవించిన సమయంలో కుటుంబ సభ్యులందరూ ఇంటి బయట ఉండడంతో ప్రాణాపాయం తప్పింది. ఇంటితోపాటు సర్వం కోల్పోయి బజారున పడ్డామని బాధితులు వాపోయారు. విషయం తెలిసిన వెంటనే మున్సిపల్ చైర్మన్ డి రమేష్ కుమార్ హుటాహుటిన సంఘటన స్థలాన్ని చేరుకున్నారు. బాధితులను పరమార్శించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని చైర్మన్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తో పాటు టిడిపి నాయకులు ఆంజాద్, అజ్మతుల్లా, అల్లాబకాష్, అన్వర్, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారీ నేరం

ప్రజాశక్తి - నల్లచెరువు

నాటుసారా తయారీ, అమ్మకం నేరమని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు వారు మండలంలోని బాలేపల్లి తండాలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ఎక్సజ్ ఆఫీసర్ గోవింద్ నాయక్ నేతృత్వంలో అవగాహన కల్పించారు. నాటు సారాయి నిర్మూలనకు కలసికట్టుగా పనిచేయాలన్నారు. గ్రామస్తుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కళాజాత బృందంచే అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తనకల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ మారుతి రావు, జిలాజీ బాషా, ఎస్స జీలనీ బాషా, నల్లచెరువు ఎస్ఐ మక్బూల్‌బాషా, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులతో పాటు గ్రామ సర్పంచి, మహిళా పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తనకల్లు : మండల పరిధిలోని గేమే నాయక్ తాండ లో సోమవారం సర్పంచి మూడే కాంతమ్మ అధ్యక్షతన ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. నాటుసారా వల్ల కలిగే అనర్థాలపై కళాజాత బృందంచే అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి గోవింద్ నాయక్, తనకల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ మారుతి రావు, ఎస్ఐ జిలానీబాషా, ఎక్సైజ్ సిబ్బంది, టిడిపి నాయకులు ఉత్తన్న నాయక్ శంకర్ నాయక్ గ్రామ మహిళలు, మహిళ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్లపై రంగు

కోడిగుడ్లపై వేసిన ఆకుపచ్చ రంగు గుర్తు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-పెనుకొండ

అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలకు అందించే కోడిగుడ్లపై రంగు గుర్తులు వేశారు. ఇటీవల ప్రజాశక్తి దినపత్రిక లో 'గుడ్డు వెరీ బ్యాడ్' శీర్షికన ఓ కథనం ప్రచురితమైంది. దీంతో గుత్తేదారులు, రవాణాదారులు చేస్తున్న అక్రమాలు వెలుగుచూశాయి. దీంతో అధికారులు అప్రమత్తమై గుత్తేదారు, రవాణాదారులను హెచ్చరించారు. నెలలో నాలుగు సార్లు కోడిగుడ్లు రవాణా చేసేలా చర్యలు చేపట్టా రు. కోడిగుడ్లపై ఒక్కోసారి ఓ రంగు గుర్తు తప్పనిసరిగా వేయాలని ఆదేశించారు. దీంతో కోడిగుడ్లపై ఇలా ఆకుపచ్చ రంగు గుర్తు వేసి సరఫరా చేశారు. అలాగే పరిమాణం(సైజు) తక్కువ ఉన్న గుడ్లను సరఫరా చేస్తున్న గుత్తేదారుపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నట్లు సమాచారం. దీంతో నాణ్యత గల పరిమాణం ఎక్కువ ఉన్న కోడిగుడ్లను సరఫరా చేశారు.

లేపాక్షి పంచాయతీలో వేలం

ప్రజాశక్తి-లేపాక్షి

లేపాక్షి పంచాయతీ పరిధిలోని వారపు సంతలో షాపులు, బస్టాండ్ వాహనాలకు సంబంధించి రుసుము వసూలు చేయడానికి సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. బస్టాండ్ వేలం పాటలో 15 మంది ధరావత్తు చెల్లించి పాల్గొనగా అత్యధికంగా రూ. 72.21 లక్షలకు శంకర్‌రెడ్డి దక్కించుకున్నాడు. ఇక వారపు సంతలో ఏడుగురు పాల్గొనగా సురేష్ అత్యధికంగా రూ. 3.26లక్షలకు దక్కించుకొన్నాడు. కార్యక్రమంలో ఈఓఆర్‌డి ఆనంద్‌కుమార్, రూరల్ సిఐ జనార్ధన్, ఎస్ఐలు నరేంద్ర, మునీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలోని 34 వ వార్డు రాజేందర్ నగర్ లో నివాసం ఉంటున్న మంగళ లక్ష్మీనారాయణ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం నాయకులు, మదీనా మసీద్ కమిటీ కమిటీ సభ్యులు సోమవారం బాధితుడిని అతని ఇంటివద్దకు వెళ్లి పరామర్శించారు. మదీనా మజీద్ కమిటీ, మదీనావెల్ఫేర్ కమిటీ సభ్యులు నాగూర్ హుస్సేన్ ఆధ్వర్యంలో 10 వేల రూపాయలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.అల్తాఫ్ .అయూబ్ ఖాన్, టింకర్ ఖాజ, సలీంఖాన్. అబ్దుల్ అజీజ్, ఇలాహి చాంద్ భాష, అమీర్ ఖాన్, ఈనాయతుల్లా, షేక్షావలి, ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఒపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని గొడ్డు వెలగల గ్రామ రెవెన్యూ విఆర్ఒ జయ రాములుపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ మాజీ సర్పంచి బి ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక తహశీల్దార్ బి బాబురావు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొడ్డు వెలగల వీఆర్వో గ్రామ ప్రజలు రైతులు సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. పట్టాదారు పాసు పుస్తకాల జారీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడన్నారు. విఆర్ఒ వ్యవహార శైలిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు రైతులు తదితరులు పాల్గొన్నారు

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలోని ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ తరపున జాతీయ రహదారి నాలుగు కూడళ్ల సర్కిల్లో ఉన్న బస్సు షెల్టర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టౌన్ సిఐ శివరాముడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రయివేటు పాఠశాలల కరస్పాండెంట్లు సింగారెడ్డి, నాయుడు ,మల్లికార్జున్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న కంటెంజెంట్ ఆయాలు, స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో మహేష్‌కి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు మండల కన్వీనర్ జె వి రమణ, సీనియర్ నాయకులు ఎస్‌హెచ్ బాషా,కో కన్వీనర్ అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కంటెంట్ ఆయాలకు కేవలం 4వేల రూపాయలు, స్వచ్ఛభారత్ కార్మికులకు 6వేలు ఇస్తూ కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని విమర్శించారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వారికి జీతభత్యాలు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందన్నారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, వారి వేతనాల కోసం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం 300 మంది విద్యార్థులకు ఒక ఆయన కేటాయించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎల్ ఆదినారాయణ, ఎస్ హైదర్‌వలి, చౌడమ్మ, జయమ్మ, వరలక్ష్మి, అంజనమ్మ, లక్ష్మీదేవి, వాణి తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

బిసిలపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని ఆసంఘం నాయకులు హితవు పలికారు. పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరామం అతిథిగృహంలో బిసి సంఘాల నాయకులు విలేకరుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ టిడిపి బీసీలకు అత్యధిక రాజకీయ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అయితే ఇటీవల వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, రామగిరి పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ సుధాకర్ యాదవ్ ని ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడటం మంచి పద్ధతి కాదని అన్నారు. ఎస్ఐకి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మా బీసీలు అని చెప్పుకున్న మీరు బీసీలను చులకనగా మాట్లాడుతున్నారన్నారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే బీసీలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప, ఉపాధ్యక్షుడు ఉమాపతి యాదవ్, నాయకులు పల్లా కిరణ్ యాదవ్, భూమిగానీ రాజశేఖర్ యాదవ్, భాస్కర్ బాబు, దేరంగుల నారాయణ, బత్తిన చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వాడ పాఠశాలల్లో

హిందీ మాధ్యమం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని తుమ్మకుంట పారిశ్రామిక వాడలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ మాధ్యమాన్ని ఏర్పాటు చేయాలని పారిశ్రామిక వాడ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పావులూరి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ, హిందూపురం మండలం తూమకుంట, గొల్లాపురం పారిశ్రామిక వాడల్లో దాదాపు 20 స్టీలు పరిశ్రమలు ఉన్నాయన్నారు. ఇందులో ఎక్కువగా బీహార్, యు.పి., ఎం.పీ రాష్ట్రాల నుండి వలస వచ్చిన కార్మిక కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. ఈ వలస కార్మికులకు చెందిన దాదాపు 150 మందికి పైగా చిన్న పిల్లలు ఇక్కడ తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు చదువుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు విద్యార్థులు పాఠశాలకు వస్తుండగా మరికొందరు హిందీ సౌలభ్యం లేకపోవడంతో పిల్లల జీవితాలు అంధకారం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వలస కార్మికుల పిల్లలకు ప్రత్యేకంగా హిందీ మాధ్యమ పాఠశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తుమకుంట పారిశ్రామికవాడ కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్, వినోద్ కుమార్, ఇస్మాయిల్, చలపతి, మారుతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినతిని ఇస్తున్న కార్మిక సంఘాల నాయకులు

డాక్టర్ ఆయేషాను సన్మానిస్తున్న మంత్రి, ఎస్పీ, తదితరులు

డాక్టర్ ఆయేషా దుర్ధానాకు

మహిళా శిరోమణి పురస్కారం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి చెందిన ప్రభుత్వ కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ అయేషా దుర్ధానా కు మహిళా శిరోమణి పురస్కారం దక్కింది. పెనుకొండలో శ్రీసత్య సాయి జిల్లా రచయిత ల సంఘం ఆధ్వర్యంలో జరిగిన మహిళాదినోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత చేతుల మీదుగా పురస్కారం అందుకుంది. ప్రభుత్వ వైద్యశాలలో కంటి శస్త్ర చికిత్సలు చేస్తూ హిందూపురం పరిసర ప్రాంతాల్లో నే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల్లో ప్రశంసలు అందుకున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా శిరోమణి అవార్డు దక్కించుకోవడం పట్ల ఆమెను పలువురు అభినందించారు.

చేనేతలను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

చేనేత కార్మికులకు రాష్ట్ర బడ్జెట్లో జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం ధర్మవరం పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్లో అంబేద్కర్ విగ్రహం దగ్గర అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా కార్యదర్శి బుడగ వెంకటనారాయణ మాట్లాడుత ాఎన్నికల ముందు చేనేత కార్మికులకు అన్ని విధాల ఆదుకుంటామన్న నాయకులు అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారని విమర్శించారు. ఇచ్చిన హామీలకు అనుగుణంగా బడ్జెట్‌లో రూ. 2వేలకోట్లు కేటాయించి ఆదుకుంటారని ఆశించిన నేతన్నలకు నిరాశ మిగిలిందన్నారు. వెంటనే ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, చెన్నంపల్లి శ్రీనివాసులు, వెంకటస్వామి, విజయభాస్కర్, ఆదినారాయణ, శ్రీనివాసులు, శ్రీధర్ తదతరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

అనుమతులు లేకుండా కల్లు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

అనుమతులు లేకుండా ఎవరైనా కల్లును కలిగి ఉన్నా, విక్రయించినా, రవాణా చేసినా చట్టరీత్యా చర్యలు తప్పవని ఎక్సైజ్ సిఐ లక్ష్మీదుర్గయ్య హెచ్చరించారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్ లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిలమత్తూరు మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి వెళ్లే మలుపు వద్ద వీరాపురానికి చెందిన రామాంజినేయులు అనే వ్యక్తి లైసెన్సు లేకుండా సుమారు 30 లీటర్ల కల్లు కలిగి ఉండగా, అతడిని అదుపులోకి తీసుకుని కల్లును స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. హిందూపురం ఎక్సైజ్ పరిధిలో విషపదార్థాలు కలిగిన కల్లును కలిగి ఉన్నా, లైసెన్సు లేకుండా విక్రయించిన కేసులు నమోదులు చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐలు పృథ్వీ రాజ్, ఫరూక్, హెడ్ కానిస్టేబుళ్లు నరసింహ, సతీష్, వెంకటేష్, కానిస్టేబుళ్లు ఆంజినేయులు, సురేష్, సుధాకర్‌రెడ్డి, శివకుమార్, రవీంద్ర, కుమార్, రంగధామ, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై నేడు ప్రజావేదిక

ప్రజాశక్తి-గుడిబండ

ఉపాధి హామీ కింద చేపట్టిన కన్వర్జెన్సీ పనులకు సంబంధించి 2023 ఏప్రిల్ 7 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకూ ఖర్చుపెట్టిన నిధులు, పనులపై మంగళవార స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ గంగాధర్ సోమవారం తెలిపారు. 2025 మార్చి 1 నుంచి 2025 మార్చి 17వ తేదీ వరకూ క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేసి తుది నివేదిక సమర్పించేందుకు ప్రజావేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజలు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

సెజ్ పేరుతో భూ సేకరణ ఆపాలి

ప్రజాశక్తి-మడకశిర

సెజ్ పేరుతో మండలంలోని గౌడనహళ్లి, తురకవాండ్లపల్లి, జమ్మనపల్లి గ్రామాల్లో వ్యవ సాయ భూముల సేకరణ ప్రక్రియను తక్షణమే నిలిపి వేయాలని, భూనిర్వాసిత రైతులకు నెలకు రూ. 10వేలు భృతి ఇవ్వాలని వైసిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయా గ్రామాల రైతులతో కలిసి తహశీల్దార్ కరుణాకర్‌కు వినతిపత్రం అందజేశారు. మూర్తి మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో అందరూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే అని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. సెజ్ పేరుతో అధికారులు 2వేల ఎకరాలు సేకరించే ప్రయత్నం చేస్తున్నారని, ఆ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలన్నారు. గతంలో సేకరిం చిన 1600 ఎకరాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గౌడనహళ్లి, ఆర్.అనంత పురం గ్రామాల్లో 15 ఏళ్ల క్రితం భూములు సేకరించారే కానీ ఇప్పటివరకు పరిశ్రమలు ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో రైతులు ఉపాధి కోసం కర్నాటక, తదితర ప్రాంతాలకు వలస వెళ్లారన్నారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

భూ కబ్జాదారులపై ఫిర్యాదు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రానికి కూతవేటు దూరంలో వున్న దేవర చెరువు కబ్జాకు గురైందని, అంతే కాకుండా మండల పరిధిలోని పెద్ద చెరువు,ధనియానిచెరువు తదితర చెరువులు కబ్జాకు గురవుతున్నారని వాటిని కాపాడాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆపార్టీ మండల కార్యదర్శి జి రమణ సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో తహశీల్దార్ దేవేంద్ర నాయక్,ఎంపిడిఒ అంజినప్పకు వినతి పత్రం అందజేశారు. దేవర చెరువు సర్వే నంబర్ 580లో 61.58 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్నట్లు రికార్డులు పేర్కొంటున్నాయని,కాని క్షేత్ర స్థాయిలో చెరువు విస్తీర్ణం సగానికి సగం పైగా కబ్జాకు గురైందన్నారు. చెరువు ఆక్రమణలపై ఇదివరకే గతంలో వున్న అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.కబ్జా దారుల నుండి భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం భావ్యం కాదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.కార్యక్రమంలో మండల నాయకులు గంగులప్ప, జిల్లా మహిళా గౌరవ కార్యదర్శి ఆదిలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుండె వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక సిద్దేశ్వర మెడికల్ షాపు ఆధ్వర్యంలో సోమవారం గుడిబండలో నిర్వహించిన ఉచిత గుండె, కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అనంతపురంలోని కిమ్స్ సవేరా ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ సందీప్, డాక్టర్ మారుతి, టెక్నీషియన్ సుజన 90 మంది రోగులకు వివిధ రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏడుగురిని గుండె శస్త్ర చికిత్సకు, 10 మందిని కంటి శస్త్రచికిత్సకు ఎంపిక చేసి ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు డాక్టర్ సందీప్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి కరుణాకర్, సుధాకర్, సిద్దేశ్వర మెడికల్ షాపు యజమాని డాక్టర్ లోకేష్, క్యాంప్ కోఆర్డినేటర్ ఏకాంత్, మార్కెటింగ్ మేనేజర్ సిద్ధిక్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లక్ష్మీనారాయణ, ఆప్తమాలజీ టెక్నీషియన్లు శ్రీలత, మదిహా, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు మంత్రి చిత్రపటం అందజేత

ప్రజాశక్తి-రొద్దం

మండల డీలర్ల సంఘం అధ్యక్షులు పైగేరి సిద్దన్న ఆధ్వర్యంలో సోమవారం టిడిపి నాయకులు ఎంపిడి, తహశీల్దార్ కార్యాలయాలతో పాటు సచివాలయం-1, 2, ఎంజెపి రెసిడెన్షియల్ స్కూల్‌లో అధికారులకు రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి చిన్నప్పయ్య, లక్ష్మీనారాయణ, లింగప్ప, డీలర్లు ఉమాశంకర్, గోపి, రామాంజనేయులు, సోమశేఖర్, బోయ శ్రీనివాసులు, నాగార్జున, హెచ్.నరసింహులు పాల్గొన్నారు.